సాక్షి
నిజామాబాద్

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



ఎత్తిపోతల పున:ప్రారంభానికి..
సాలూర శివారులోని మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం పున:ప్రారంభానికి సంబంధిత అధికారులు కసరత్తు చేపట్టారు.
- IIలో ▸



335 టీఎంసీల వరద..!
శ్రీరాంసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఈ సంవత్సరం ఇప్పటి వరకు 335 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.
- IIలో ▸

గరిష్టం/కనిష్టం
29.6 /21.6

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. రోజంతా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కవిత వ్యాఖ్యలు బాధాకరం

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: మాజీ మంత్రి హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్‌కుమార్‌పై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు బాధాకరమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం రాత్రి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం అయినా, పాలన అయినా ప్రజల క్షేమం కోసం, పార్టీ కోసం, తెలంగాణ కోసం హరీశ్ రావు నిర్విరామంగా కృషి చేశారని తెలిపారు. కేసీఆర్ వెన్నంటి ఉంటూ 25 సంవత్సరాలుగా నిస్వార్థంగా పార్టీ కోసం సంతోష్‌కుమార్ పాటుపడుతున్నారని తెలిపారు. అటువంటి వారి వ్యక్తిత్వం, కమిట్‌మెంట్‌పై కవిత విమర్శలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు.

తగ్గిన నీటి విడుదల

- ఎస్సారెస్పీలోకి లక్షా 16 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో వరద గేట్ల ద్వారా నీటి విడుదలను అధికారులు తగ్గించారు. ఎగువ లక్షా 16 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 23 గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 18 వేలు, కాకతీయకాలువ ద్వారా 4500, ఎస్కేప్ గేట్ల ద్వారా 3500 క్యూసెక్కు ల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1089.9(76.10 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ప్రతిభను వెలికి తీసేందుకు 'కళా ఉత్సవ్'



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా స్థాయి కళా ఉత్సవ్ సాంస్కృతిక పోటీలు ఎంతో దోహదం చేస్తాయని డీఈవో అశోక్ పేర్కొన్నారు. నగరంలోని బాల్ భవన్‌లో బుధవారం కళా ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులపాటు గ్రూప్ డ్యాన్స్, సోలో డ్యాన్స్, గ్రూప్ సాంగ్స్, సోలో సాంగ్, స్కిట్, 2డీ , 3డీ డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు. ఏఎంవో బాలకృష్ణారావు, అర్బన్ ఎంఈవో సాయిరెడ్డి, జ్యూరీ కమిటీ మెంబర్స్ లక్ష్మీనాథం, ఆర్.గోపాలకృష్ణ, కాసర్ల నరేశ్‌రావు, లక్ష్మణ్, చింతల శ్రీనివాస్, డాక్టర్ శారద, న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు.

నేడు వైన్‌షాపులు బంద్

ఖలీల్‌వాడి: వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లాలో వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్‌లను గురువారం మూసివేయనున్నట్లు సీపీ సాయిచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6గంటల నుంచి శుక్రవారం ఉదయం 6గంటల వరకు వైన్స్‌లు, బార్‌లు, కల్లు దుకాణాలను మూసి ఉంచాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు జిల్లావాసులు మృతి
- పాలాజ్ గణేశ్ మందిరానికి వెళ్లి వస్తుండగా ఘటన

వర్ని: మహారాష్ట్రలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. వర్ని మండలం హుమ్నాపూర్, బోధన్ మండలం బెల్లాల్‌కు చెందిన బంధువులు ఐదుగురు బుధవారం ఉదయం కారులో మహారాష్ట్రలోని పాలాజ్ గణేశ్ మందిరానికి వెళ్లారు. దర్శనం అనంతరం రాత్రి తిరిగి వస్తుండగా నాందేడ్ జిల్లా బోకర్ తాలూక ప్రాంతంలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న చేకూరి బుల్లి రాజు(50), అతని భార్య సునీత (45), వాణి (38) అక్కడికక్కడే మృతి చెందగా, గున్నం చంద్రశేఖర్ (35), నీలిమా(45)కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్, బైంసా ఆస్పత్రులకు తరలించారు.

మరోసారి ఉపఎన్నిక!

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి మరోసారి ఉప ఎన్నిక అనివార్యం కానుంది! బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్ తరువాత ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేస్తున్నట్లు కవిత ప్రకటించడంతో 'ఉప ఎన్నిక' చర్చ తెరపైకి వచ్చింది. ఎమ్మెల్సీ స్థానానికి 2020లో ఒక సారి ఉప ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే.



- రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కవిత
- మండలి చైర్మన్ ఆమోదిస్తే ఉప ఎన్నిక పెట్టాల్సిందే
- 2020 ఉప ఎన్నికలు, 2022 ఎన్నికల్లో కవిత విజయం
- స్థానిక సంస్థల ఎన్నికల తరువాతే ఉప ఎన్నికకు అవకాశం
- తాజా పరిస్థితులపై జోరుగా చర్చలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీఆర్‌ఎస్ నుంచి కవిత సస్పెన్షన్ వ్యవహారం మరో ఉప ఎన్నికకు దారితీసింది. పార్టీ నుంచి వేటుపడిన వెంటనే ఆమె తన శాసన మండలి సభ్యత్వానికి సైతం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఉప ఎన్నికపై జోరుగా చర్చ సాగుతోంది. 2019లో ఎంపీగా ఓటమిపాలైన కవిత.. 2020లో జరిగిన ఉప ఎన్నికలో స్థానికసంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీగా ఉన్న డాక్టర్ భూపతిరెడ్డిపై అనర్హత వేటుపడడంతో ఉప ఎన్నిక రాగా, కవిత బరిలో నిలిచి గెలిచారు. ఆ స్థానం కాలపరిమితి ముగియడంతో 2022 జనవరిలో నిర్వహించిన ఎన్నికల్లో కవిత మరోసారి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2028 వరకు కాలపరిమితి ఉన్నప్పటికీ తాజా పరిణామాల నేపథ్యంలో బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. శాసనమండలి చైర్మన్ ఆమె రాజీనామాను ఆమోదిస్తే ఉప ఎన్నిక నిర్వహించాల్సిందే.

ప్రస్తుతం రాష్ట్రంలో 'స్థానిక' ఎన్నికల వాతావరణం ఉండగా.. అదే కోటాలో నిర్వహించాల్సిన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఆలస్యం అవడం ఖాయం. ఉప ఎన్నిక నిర్వహించాలంటే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంటుంది.

ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. ఉప ఎన్నికలకు ఆస్కారమిచ్చారు..

2016 జనవరిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా డాక్టర్ భూపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే భూపతిరెడ్డి కాంగ్రెస్ నుంచి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేగా పోటీ చేయడంతో 2020లో అనర్హత వేటుకు గురయ్యారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆ సమయంలో నిర్వహించిన ఉప ఎన్నికల్లో గెలుపొందిన కవిత, తరువాత జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్ వేటుకు గురైన కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. స్పీకర్ ఆమోదిస్తే, స్థానిక ఎన్నికలు పూర్తయ్యాక ఉప ఎన్నిక నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటోంది.

నేడు కామారెడ్డికి సీఎం రాక



హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర

- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. వరద ఇళ్లను చుట్టేసింది. పంటలను ముంచేసింది. రోడ్లను ధ్వంసం చేసింది. వాగుల ప్రవాహ ఉధృతికి వంతెనలు కొట్టుకుపోయాయి. మునుపెన్నడూ చూడని వరదలతో జిల్లాలో భారీ నష్టం వాటిల్లింది. నష్టాన్ని పరిశీలించడానికి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం జిల్లాకు వస్తున్నారు. ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని జిల్లావాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీఎం పర్యటన ఇలా...

సీఎం రేవంత్ హెలీకాప్టర్‌లో 11.30 గంటలకు తాడ్వాయి మండలం ఎర్రాపహడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన లింగంపేట మండలం లింగంపల్లి కుర్దుకు చేరుకొని దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించిన వంతెనను పరిశీలిస్తారు. బూరుగిద్ద శివారులో వరదలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి రోడ్డు మార్గాన 1.10 గంటల వరకు కామారెడ్డి పట్టణ శివారులోని జీఆర్ కాలనీని సందర్శించి, బాధితులతో మాట్లాడతారు. 2 గంటలకు కలెక్టరేట్ భవనానికి చేరుకొని ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు. కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజనం ముగించిన అనంతరం సమావేశ మందిరంలో 2.20 గంటల నుంచి 3 గంటల వరకు అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సీఎం రాక సందర్భంగా బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర లింగంపేట మండలంలో పర్యటించారు.

రేపు జీపీవోలకు నియామక పత్రాలు

నిజామాబాద్ అర్బన్: గ్రామ పాలన అధికారులుగా ఎంపికైన వారికి ఈ నెల 5న హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి నియామకపత్రాలు అందజేయనున్నట్లు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేశ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ జీపీవోలుగా ఎంపికైన అభ్యర్థులకు ముందస్తు సమాచారం అందించి హైదరాబాద్‌కు సకాలంలో చేరుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 301 మంది జీపీవోలుగా ఎంపికయ్యారని, వీరిని 5న ప్రత్యేక బస్సులలో హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ కేంద్రాలకు ఉదయం 7గంటలకు జీపీవో అభ్యర్థులు చేరుకోవాలని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఆర్‌ఐ

- ఆర్మీ జవాన్ నుంచి రూ. 7 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ శ్రీనివాస్
- వీఎల్‌టీ కోసం రూ.12 వేలు డిమాండ్
- గతంలోనూ ఏసీబీకి చిక్కిన వైనం

నిజామాబాద్ సిటీ: వీఎల్‌టీ (వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్) సర్టిఫికెట్ కోసం రూ.7వేలు లంచం తీసుకుంటూ నిజామాబాద్ నగర పాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌కు చెందిన ఆర్మీ జవాన్ ఒకరు ఖాళీ స్థలంలో జ్యూస్‌సెంటర్ కోసం అనుమతులు తీసుకున్నాడు. ఖాళీ స్థలానికి సంబంధించిన వీఎల్‌టీ (వెకెంట్ లాండ్ ట్యాక్స్) సర్టిఫికెట్ కోసం బల్దియాలో దరఖాస్తు చేసుకొని సంబంధిత ఫీజు చెల్లించాడు. కానీ, అనుమతి పత్రం ఇచ్చేందుకు ఆర్‌ఐ శ్రీనివాస్ రూ.12 వేలు డిమాండ్ చేశారు. తాను ఆర్మీ జవాన్ అని చెప్పినా ససేమిరా అన్నాడు. ఆర్మీ అయితే బోర్డర్‌లో.. ఇక్కడ డబ్బులిస్తేనే పనులు అవుతాయి అనడంతో జవాన్ ఆత్మాభిమానం దెబ్బతింది. ఆర్‌ఐకు బుద్ధి చెప్పాలని నిశ్చయించుకొని, చివరకు రూ.10 వేలు ఇస్తానని ఒప్పుకొని ఏసీబీని ఆశ్రయించాడు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో బల్దియాలోని రెవెన్యూ కార్యాలయం వద్ద ఆర్మీ జవాన్ వద్ద రూ.7 వేల నగదును ఆర్‌ఐ శ్రీనివాస్ తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ లక్ష్మీకాంత్‌రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌కు సమాచారం ఇచ్చి, ఆర్‌ఐ శ్రీనివాస్‌ను ఏసీబీ కోర్టుకు తరలించారు.



లంచం సొమ్ముతో ఆర్‌ఐ శ్రీనివాస్

రెండోసారి..

ఆర్‌ఐ శ్రీనివాస్ ఏసీబీకి చిక్కడం ఇది రెండోసారి. గతంలో ఆయన బోధన్ మున్సిపాలిటీలో బిల్లు కలెక్టర్‌గా పనిచేస్తూ ఓ వ్యక్తి నుంచి ట్రేడ్ లైసెన్సు జారీ కోసం రూ.2 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. తాజాగా బల్దియాలో ఆర్‌ఐ హోదాలో వీఎల్‌టీ కోసం రూ.7 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం గమనార్హం.

అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫామ్స్

- జిల్లా వ్యాప్తంగా 81,262 మంది చిన్నారులు
- టీచర్లు, ఆయాలకు మారిన చీరల రంగులు



టీచర్లకు, ఆయాలకు యూనిఫామ్ చీరలు



జిల్లా సంక్షేమాధికారి కార్యాలయానికి చేరిన పిల్లల యూనిఫామ్స్ క్లాత్

నిజామాబాద్‌నాగారం: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుంది. అందులో భాగంగా ఆరేళ్లలోపు చిన్నారులకు యూనిఫామ్స్ అందించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే జిల్లా సంక్షేమాధికారి కార్యాలయానికి యూనిఫామ్ క్లాథ్‌ను సరఫరా చేసింది. జిల్లాలో బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, భీమ్‌గల్, ఆర్మూర్ సీడీపీవో కార్యాలయాలు ఉండగా, వాటి పరిధిలో 1501 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో 81,262 మంది పిల్లలు చదువుతున్నారు. గతేడాది 30 శాతం చిన్నారులకే యూనిఫామ్స్ రాగే, ఈ ఏడాది మాత్రం 100శాతం పిల్లలకు పంపిణీ చేసేందుకు క్లాథ్‌ను సిద్ధం చేశారు. ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున పిల్లల కొలతల ఆధారంగా కుట్టించి త్వరలోనే పంపిణీ చేయనున్నారు. కాగా, డీఆర్‌డీవో సహకారంతో మహిళా సంఘాల సభ్యులతో యూనిఫామ్స్ కుట్టించనున్నారు.

2,328 మందికి చీరలు

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు గత కొన్నేళ్లుగా ఒకే రకమైన చీరలను ప్రభుత్వం పంపిణీ చేసేది. ఐతే ఈ సంవత్సరం చీరల రంగులు మారాయి. జిల్లాలో 1,427 అంగన్‌వాడీ టీచర్లు, 901 మంది ఆయాలు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున చీరలు, బ్లౌజులు అందజేశారు.

యూనిఫామ్స్ కచ్చితంగా ధరించాలి

జిల్లాలోని టీచర్లు, ఆయాలు కచ్చితంగా యూనిఫామ్స్ ధరించి విధులకు హాజరుకావాలి. అంగన్‌వాడీకి వచ్చే పిల్లలందరికీ రెండు జతల చొప్పున యూనిఫామ్స్ త్వరలోనే అందజేస్తాం.
– రసూల్‌బీ, జిల్లా సంక్షేమాధికారిణి

ఎలక్ట్రిక్ బస్సులో పొగలు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు



పొగలను ఆర్పుతున్న సిబ్బంది

డిచ్‌పల్లి: సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో బుధవారం రాత్రి త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ ఆర్టీసీ డిపో–2కు చెందిన ఎలక్ట్రిక్ బస్సు సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వస్తోంది. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామం వద్దకు రాగానే ఒక్కసారిగా పొగలు వచ్చాయి. బస్సులోని బ్యాటరీ నుంచి కాలిన వాసన వస్తుండడంతో గమనించిన డ్రైవర్.. వెంటనే బస్సును నిలిపివేశారు. బస్సులో ఉన్న 22 మంది ప్రయాణికులను కిందికి దించివేశారు. బ్యాటరీపై కార్బన్ డయాక్సైడ్ వాయువును స్ప్రే చేసి పొగలు ఆర్పివేశారు. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు పేర్కొన్నారు. అనంతరం ప్రయాణికులను ఇతర బస్సులలో నిజామాబాద్‌కు పంపించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ఎరువుల గోదాం, పల్లె దవాఖానా తనిఖీ

జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో అర్గుల్ సొసైటీ ఎరువుల గోదామును, డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో పల్లె దవాఖానను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సొసైటీలో గోదాములో నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించిన కలెక్టర్.. ఈ సీజన్‌లో ఇంకా ఎంత మొత్తంలో యూరియా అవసరం పడుతుందని ఆరా తీశారు. స్టాక్ మిగిలి ఉండగానే, ఇండెంట్ పెట్టి కొత్త స్టాక్ తెప్పించుకోవాలని జక్రాన్‌పల్లి మండల వ్యవసాయ అధికారిణి దేవికకు సూచించారు. పడకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని నడిపల్లి పల్లెదవాఖాన సిబ్బందికి సూచించారు. ఆయన వెంట జక్రాన్‌పల్లి తహసీల్దార్ కిరణ్మయి, ఏవో దేవిక, జీపీ కార్యదర్శి భాస్కర్, సొసైటీ సీఈవో తిరుపతిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ వినీత్, ఏఎన్ఎంలు సుజాత, రజిత తదితరులు ఉన్నారు.



పడకల్‌లో ఎరువుల గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

వరద బాధితులను ఆదుకుంటాం

- రూ.మూడున్నర కోట్లతో రోడ్లు, వంతెనలకు మరమ్మతులు
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



కొండూర్‌లో బాధితులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ/ధర్పల్లి: కప్పలవాగు వరదతో నష్టపోయిన బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. ధర్పల్లి మండలం వాడి, సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్, కొండూర్, గడ్కోల్, తూంపల్లి, పాకాల, కొండాపూర్, ముషీర్‌నగర్ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో వర్షానికి కోతకు గురైన రోడ్లు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కొండూర్‌లో వరద ముంచెత్తి నిరాశ్రయులైన బాధితులను పరామర్శించి ఓదార్చారు. ఇళ్లు కూలిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కొండూర్‌లో మీడియాతో మాట్లాడారు. ముత్యాల చెరువు కట్ట తెగిపోవడం, 30 సెం.మీ వర్షం కురవడంతో భారీ నష్టం ఏర్పడిందన్నారు. 55 ఇళ్లు పూర్తిగా కూలిపోయి, సామగ్రి అంతా కొట్టుకుపోవడంతో బాధితులకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. మూడున్నర కోట్లతో రోడ్లు, వంతెనలకు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ అర్వింద్ చేసిన విమర్శలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. వర్షాలతో జరిగిన నష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నిధులు తేవాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కవిత సస్పెన్షన్ వారి కుటుంబ డ్రామా అని విమర్శించారు. అనంతరం పాకాలలో మాజీ సర్పంచ్ కీరిబాయి, కొండూర్‌లో పార్టీ నాయకుడు చెల్లెం నడ్పి గంగయ్య కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెల్మ భాస్కర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, ఉమ్మజీ నరేశ్, ఎర్రన్న, బాకారం రవి, సొసైటీ చైర్మన్ గంగాధర్, దేగాం సాయన్న, దశరథ్‌రెడ్డి, సంతోష్‌నాయక్, బాల్‌సింగ్, భానుచందర్, దేవరాజు, శ్రీధర్, జగన్, బుచ్చన్న, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట: వరద నీటి ఉధృతితో పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని నాళేశ్వర్, తుంగిని, బినోల గ్రామాలలో ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. బినోలాలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సారెస్పీలో ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి పెరగడంతో ప్రతి సంవత్సరం నది తీరంలోని పంటలు నీట మునుగుతాయని, కానీ ఎన్నడూ పంటలకు నష్టం చేకూరలేదన్నారు. ఈసారి ఉధృతి రెట్టింపవడంతో నాలుగు రోజులకు మించి పంటలు నీటిలో మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. బినోలా శివారులో 67 ట్రాన్స్‌ఫార్మర్లు, 10 విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయని, వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రాజుగౌడ్, సంజీవ్‌రెడ్డి, నర్సింగ్‌రావ్, చిన్నదొడ్డి ప్రవీణ్, సంజీవ్‌రావ్, సాయారెడ్డి తదితరులు ఉన్నారు.



బినోలాలో వరి పైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

క్లుప్తంగా

'ఇన్‌స్పైర్‌' నామినేషన్లకు 15 వరకు గడువు

నిజామాబాద్‌అర్బన్‌: ఇన్‌స్పైర్‌ అవార్డుల నామినేషన్ల గడువు ఈ నెల 15వ తేదీతో ముగియనుందని డీఈవో అశోక్‌ తెలిపారు. నగరంలోని కోటగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జూన్‌ 15న నామినేషన్ల ప్రక్రియ మొదలైందని, ఈ నెల 15తో ముగుస్తుందన్నారు. జిల్లాలో నామినేషన్లు తక్కువగా నమోదయ్యాయని తెలిపారు. కేజీబీవీ, మోడల్‌ స్కూల్స్‌, రెసిడెన్షియల్‌, ప్రైవేట్‌ పాఠశాలలు తప్పనిసరిగా ఐదు నామినేషన్ల చొప్పున నమోదు చేసేలా సమీక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా సైన్స్‌ అధికారి గంగాకిషన్‌, సీఎంవో శ్రీనివాసరావు, ఆర్పీలు గోవర్ధన్‌, శైలేశ్‌, మల్లేశం, రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

6న జూనియర్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ ఎంపికలు

నిజామాబాద్‌ నాగారం: జిల్లా బాల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 6న పాత కలెక్టరేట్‌ మైదానంలో జూనియర్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ ఎంపికలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేశ్‌, శ్యామ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎంపికలు ఉంటాయని తెలిపారు. టోర్నీలో పాల్గొనాలనుకునే క్రీడాకారులు 02.01.2010 తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఈ నెల 12 నుంచి 14 వరకు జనగాం జిల్లాలో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్‌ బాలుర, బాలికల బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్‌ నాగారం: జిల్లాలో వరుసగా కురుస్తున్న భారీవర్షాలతో ప్రజలు సీజనల్‌ వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో ఇళ్లలోకి నీరు చేరడంతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులతోపాటు శ్వాసకోశ వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. గ్రామాల్లోని నీటి ట్యాంకులను క్లోరినేషన్‌ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 59 ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, 2,334 రోగులకు చికిత్స అందించామని తెలిపారు.

రేపు జిల్లాస్థాయి చెస్‌ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా చెస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 5న నగరంలోని వినాయక్‌నగర్‌ అభ్యాస స్కూల్‌లో అండర్‌–15 బాలబాలికలకు జిల్లా స్థాయి చెస్‌ టోర్నీ, ఎంపికలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి రమేశ్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01.01.2010 తర్వాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు బర్త్‌ సర్టిఫికెట్‌, చెస్‌ బోర్డు తీసుకొని రావాల ని తెలిపారు. వివరాలకు 9440007004 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎత్తిపోతల పున:ప్రారంభానికి కసరత్తు

- పథకం పంప్‌హౌస్‌ను సందర్శించిన ఇరిగేషన్‌, ఐడీసీ అధికారులు
- త్వరలో మోటార్ల ప్రారంభానికి చర్యలు



మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది



మంజీర నది ఒడ్డున ఉన్న ఎత్తిపోతల పథకం పంప్‌ హౌస్‌ ఎదుట అధికారులు, పథకం నిర్వహణ కమిటీ సభ్యులు

బోధన్‌: సాలూర శివారులోని మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం పున:ప్రారంభానికి సంబంధిత అధికారులు కసరత్తు చేపట్టారు. మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం ఈ ఏడాది వర్షాకాలానికి ముందు ఆర్థిక, సాంకేతిక కారణాల వల్ల మూతపడింది. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభ అనంతరం మంజీరలో వరద ప్రవాహం ప్రారంభం కాగానే ఎత్తిపోతల పథకం మోటార్లు ప్రారంభించి ఎత్తిపోసిన నీటిని చెరువుల్లో నింపుకొని అవసరాల మేరకు పంటల సాగుకు వినియోగించుకునే వారు. కాగా మూడు నెలల క్రితం ప్రధాన పంప్‌హౌస్‌లో ఎలక్ట్రికల్‌ ప్యానెల్‌ బోర్డు, ఇతర సామగ్రిని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పథకం నిర్వహణ కమిటీ వద్ద నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఎత్తిపోతల పథకం ఉపయోగంలోకి రాకుండా పోయింది. రైతుల సమాచారం మేరకు బుధవారం ఐడీసీ, ఇరిగేషన్‌ శాఖల అధికారులు పథకం కమిటీ సభ్యులతో కలిసి ప్రధాన పంప్‌హౌస్‌ను సందర్శించారు. కమిటీ సభ్యులతో సమావేశమై సమర్థవంతంగా నిర్వహణకు ఐడీసీ ఏఈ గజానంద్‌ సూచనలు చేశారు.

కొత్త కమిటీ ఎన్నిక

పథకాన్ని పున:ప్రారంభించేందుకు రైతులు ఇటీవల సమావేశమై నిర్వహణకు సొసైటీ మాజీ చైర్మన్‌ శివకాంత్‌ పటేల్‌ చైర్మన్‌గా కొంత మంది సభ్యులతో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. దీంతో పంప్‌ హౌస్‌లో మరమ్మత్తులు మొదలు పెట్టారు. రూ.లక్ష 50 వేల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. పథకం నీటిని వినియోగించుకుంటున్న రైతులు మెట్టభూమికి ఎకరానికి రూ.600, మాగాణికి రూ.800 చొప్పున చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. రైతులు చెల్లించిన డబ్బులతో పంప్‌ హౌస్‌ మరమ్మతులు, నిర్వహణ కార్మికులకు వేతనాలు చెల్లిస్తారు. గతంలో రెండు దఫాలు పథకానికి సంబంధించిన కరెంట్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఆయిల్‌, రాగి తీగలను దొంగలించడంతో పథకం నిర్వహణకు అవాంతరాలు ఏర్పడ్డాయి.

పంటల సాగుకు భరోసా

దశాబ్దాన్నర కాలంగా రైతులు ఐక్యంగా ఎత్తిపోతల పథకం నిర్వహణలో పట్టు సాధించారు. నిర్వహణ క్రమంలో అనేక సమస్యలు ఎదురైనా పరిష్కరించుకుని ముందుకెళ్లారు. ఎత్తిపోతల పథకం కోసం మూడు దశాబ్దాలుగా రైతులు శతవిధాల ప్రయత్నాలు చేశారు. దివంగత సీఎం వైఎస్‌ఆర్‌ హయాంలో రూ.3 కోట్లు మంజూరు చేయగా పథకం రూపుదిద్దుకుంది. 2006–07 పథకం పనులు పూర్తి చేసి ప్రారంభించారు. ఈ పథకం కింద 1600 ఎకరాలు స్థిరీకరించారు. వర్షాధార మెట్ట భూములు సస్యశ్యామలంగా మారాయి. వానాకాలం, యాసంగి సీజన్‌లో పంటల సాగుకు ఎత్తిపోతల పథకం నీటితో భరోసా ఏర్పడింది. తాజాగా పంప్‌హౌస్‌లో ఎలక్ట్రికల్‌ ప్యానెల్‌ బోర్డు, ఇతర మరమ్మతులు పూర్తిచేసి త్వరలో మోటార్లు ప్రారంభించేందుకు అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సొసైటీ చైర్మన్‌ అల్లె జనార్దన్‌, పథకం కమిటీ చైర్మన్‌ శివకాంత్‌ పటేల్‌, సభ్యులు డిస్కో సాయిలు, ఇల్తెపు సాయన్న, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు అల్లె రమేశ్‌, మాజీ ఎంపీటీసీ గాండ్ల పెద్ద రాజేశ్వర్‌, సభ్యులు పాల్గొన్నారు.

335 టీఎంసీల వరద..!

- ప్రస్తుత సంవత్సరం ఎస్సారెస్పీకి భారీ ఇన్‌ఫ్లో
- 270 టీఎంసీలు అవుట్‌ ఫ్లో
- అందులో 215 టీఎంసీలు గోదావరి పాలు



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఈ సంవత్సరం ఇప్పటి వరకు 335 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఇంకా వరద నీరు రాక కొనసాగుతూనే ఉంది. ప్రస్తుత సంవత్సరం గరిష్టంగా 5.4 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. జూన్‌, జూలై నెలల్లో ప్రాజెక్ట్‌లోకి ఆశించినంత వరద నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కానీ, జూలై చివరి మాసంలో కొద్దిమేర వరదలు రావడంతో ఆగస్టు 7 నుంచి ఆయకట్టుకు నీటి విడుదలను చేపట్టారు. ఆ తర్వాత మళ్లీ స్థానిక ఎగువ ప్రాంతాలతోపాటు, మహారాష్ట్ర ప్రాంతం నుంచి భారీగా వరద నీరు రావడంతో ప్రాజెక్ట్‌ నిండుకుండలా మారింది. అంతే కాకుండా ఆగస్టు 18 నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదిలారు. 27 నుంచి ప్రాజెక్ట్‌లోకి వరద నీరు పోటెత్తింది. గతేడాది సీజన్‌ ముగిసే వరకు 292 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నాలుగు రోజుల్లో 165 టీఎంసీలు..

ఎస్సారెస్పీలోకి ఆగస్టు 27 నుంచి వరద ప్రారంభమైంది. ఆ రోజంతా 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. 28, 29, 30, 31, సెప్టెంబర్‌ 1, 2 తేదీల్లో 165 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఆరు రోజుల్లోనే 165 టీఎంసీల వరద నీరు రావడం చరిత్రలో ఇదే తొలిసారని ప్రాజెక్ట్‌ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి.

215 టీఎంసీలు గంగపాలు..

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు రావడంతో అంతే స్థాయిలో గోదావరిలోకి నీటి విడుదలను చేపట్టారు. ప్రాజెక్ట్‌ నుంచి గరిష్టంగా 39 వరద గేట్ల ద్వారా 5.75 లక్షల క్యూసెక్కుల నీటిని గోదారికి వదిలారు. గడిచిన ఆరు రోజుల వ్యవధిలో 165 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలారు. ఇంకా నీటి విడుదల కొనసాగుతుంది.

సులభ బోధనకు టీఎల్‌ఎంలు ఉపయోగకరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్‌

నిజామాబాద్‌ రూరల్‌: బోధనాభ్యాసన ఉపకరణాలు విద్యార్థులకు జ్ఞానాన్ని సులభంగా అందించే సాధనాలని డీఈవో అశోక్‌ అన్నారు. బుధవారం గూపన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి టీఎల్‌ఎం మేళాలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధన అభ్యసన ఉపకరణాలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడుతుందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పది ఉత్తమ టీఎల్‌ఎమ్‌లను ప్రదర్శించిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం. సేవుల, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, ఘనపురం దేవేందర్‌, మంజులత, జయసాగర్‌, కృష్ణారెడ్డి, కాంప్లెక్స్‌ హెచ్‌ఎం హనుమంతరావు, సారంగపూర్‌ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పోశన్న, స్థానిక పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, వరప్రసాద్‌, అంజయ్య, నాయకులు డాక్టర్‌ సల్ల సత్యనారాయణ, రవీందర్‌, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డీజేలు సీజ్‌.. కేసులు నమోదు



రెంజల్‌: కళ్యాపూర్‌లో సీజ్‌ చేసిన డీజేలతో పోలీసులు ,నందిపేటలో.. ,నవీపేట్‌లో..

ఖలీల్‌వాడి/ రెంజల్‌/ నవీపేట్‌/ నందిపేట్‌: గణేశ్‌ నిమజ్జనాల్లో డీజేలను నిషేధించినట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య బుధవారం తెలిపారు. రెంజల్‌, నవీపేట్‌, నందిపేట్‌లో మంగళవారం రాత్రి, బుధవారం గణేశ్‌ మండపాల్లో పెట్టిన డీజేలను సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. రెంజల్‌ మండలంలోని కళ్యాపూర్‌లో సోమవారం నిర్వహించిన గణేశ్‌ నిమజ్జన శోభాయాత్రలో నిర్వాహకులు ఏర్పాటు చేసిన మూడు డీజేలను స్వాధీనం చేసుకొని సీజ్‌ చేసినట్లు తెలిపారు. అలాగే నవీపేట్‌ మండలం నిజాంపూర్‌లో మంగళవారం రాత్రి రెండు డీజే సిస్టంలతో పరిమితికి మించి సౌండ్‌ పెట్టి ప్రజలకు ఇబ్బందికి గురిచేసిన మట్టయ్యఫారానికి చెందిన దారావత్‌ రమేశ్‌, షాపూర్‌కు చెందిన పుల్ల అరవింద్‌లపై కేసు నమోదు చేసి డీజేలను సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. నందిపేట్‌ మండలం అయిలాపూర్‌లో మంగళవారం నిర్వహించిన గణేశ్‌ నిమజ్జనంలో అధిక సౌండ్‌తో ప్రజలను ఇబ్బందులకు గురిచేసని రెండు డీజేలను సీజ్‌ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండపాల నిర్వాహకులు డీజేలను ఏర్పాటు చేసుకోవద్దని సూచించారు. ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని, విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

జిల్లా ప్రజలు, రైతులను ఆదుకోవాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి బహిరంగ లేఖ

సుభాష్‌నగర్‌: సీఎం రేవంత్‌రెడ్డి గురువారం కామారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారని, నిజామాబాద్‌లోనూ భారీ వర్షాల వల్ల రూరల్‌, బోధన్‌ నియోజకవర్గాల్లో భారీ నష్టం జరిగిందని జిల్లాలోనూ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించి ప్రజలు, రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి కోరారు. ఈమేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గంలోని ధర్పల్లి మండలం వాడి, నడిమి తండా, బీరప్ప తండా, సిరికొండ మండలంలోని కొండూరు, పెద్ద వాల్గోట్‌, గడ్కోల్‌ గ్రామాల్లో భారీగా పంట నష్టంతోపాటు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ఇళ్లు, బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయి ధ్వంసమయ్యాయని, పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయన్నారు. అలాగే బోధన్‌ నియోజకవర్గంలో సాలూరా మండలంలో ఉన్న ఖాజాపూర్‌, హున్సా, మందర్నా గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయని, ఇళ్లు కూడా ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని రూరల్‌ నియోజకవర్గానికి రూ.50 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ, బోధన్‌కు రూ.10కోట్లను మంజూరు చేయాలని కోరారు.

గణేశ్‌ నిమజ్జనానికి ఫైర్‌ సిబ్బంది కేటాయింపు

ఖలీల్‌వాడి: జిల్లాలో గురువారం గణేశ్‌ నిమజ్జనం నిర్వహించే ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా అగ్నిమాపక శాఖ సిబ్బందిని కేటాయించినట్లు జిల్లా ఫైర్‌ ఆఫీసర్‌ పరమేశ్వర్‌ బుధవారం తెలిపారు. బాసర వద్ద 16, ఉమ్మెడ 10, ఆర్మూర్‌ గూండ్ల చెరువు 7, రంగన్న కుంట 3, నిజామాబాద్‌ గణపతుల బావి వద్ద 2, బోధన్‌ పసుపు వాగు వద్ద నలుగురు సిబ్బంది ఉంటారని పేర్కొన్నారు.

తెయూ పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్‌ ఎం.యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ, బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌, కామర్స్‌, అప్లయిడ్‌ స్టాటిస్టిక్స్‌, బోటని, బయోటెక్నాలజీ, కంప్యూటర్‌ సైన్స్‌, జియో ఇన్ఫర్మాటిక్స్‌, ఆర్గానిక్‌ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ, ఫిజిక్స్‌, ఎకనామిక్స్‌, మాస్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ జర్నలిజం, సోషల్‌ వర్క్‌, లా విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్‌ పేర్కొన్నారు. ఈ నెల 25వరకు యూనివర్సిటీ పరిపాలనా భవనంలో దరఖాస్తులను అందజేయాలని పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తెయూ పీజీ పరీక్షల్లో ఇద్దరు డిబార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ, బీపీఎడ్‌, ఎంఈడీ పరీక్షల్లో బుధవారం ఇద్దరు విద్యార్థులు డిబార్‌ అయినట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం నిర్వహించిన పీజీ 2, 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలకు మొత్తం 1,534 మందికి 1,431 మంది హాజరు కాగా 103 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. నగరంలోని గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌ పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డిబార్‌ అయినట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 24 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అలాగే ఉదయం నిర్వహించిన బీఎడ్‌, బీపీఎడ్‌ పరీక్షలకు 52 మందికి 40 మంది హాజరు కాగా 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంఎడ్‌ 1, 2, 3, 4వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ థియరీ పరీక్షలకు 29 మందికి 27 మంది హాజరు కాగా ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రొఫెసర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు.

క్యాంపస్‌ కబుర్లు

గెస్ట్‌ ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఇంజినీరింగ్‌ కళాశాలలో మ్యాథ్స్‌, ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, ఇంగ్లిష్‌, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్‌, సివిల్‌ ఇంజినీరింగ్‌ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్‌ ఫ్యాకల్టీ నియామకం కోసం ఈ నెల 11న పరిపాలనా భవనంలో వాక్‌ ఇన్‌ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్‌ యాదగిరి బుధవారం తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 65 శాతం మార్కులతో రెండేళ్ల కనీస బోధన అనుభవం కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్‌ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజనల్‌ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పీజీ కోర్సుల్లో సీపీగెట్‌ కౌన్సిలింగ్‌ ద్వారా ప్రవేశాలు పొందడానికి క్యాంపస్‌కు వచ్చిన విద్యార్థుల కోసం వర్సిటీ ఎన్‌ఎస్‌యూఐ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హెల్ప్‌డెస్క్‌ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అడ్మిషన్స్‌ విషయంలో అవసరమైన సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో తెయూ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు చౌదపల్లి మహేశ్‌, ఉపాధ్యక్షుడు అరుణ్‌ తేజ, జనార్దన్‌, అనిల్‌, అలియాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లను సన్మానించిన సీపీ



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయంలో సీపీ సాయిచైతన్య ఐదుగురు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లను బుధవారం సన్మానించారు. మాక్లూర్‌, నవీపేట్‌, మెండోరా, మోపాల్‌, నిజామాబాద్‌ రూరల్‌, ఆర్మూర్‌, కోటగిరి పీఎస్‌లలో 15 హత్య కేసుల్లో 11 కేసులలో నేరస్తులకు జీవిత కారాగార శిక్ష పడేలా పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు కృషి చేసినట్లు సీపీ తెలిపారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు రాజేశ్వర్‌ రెడ్డి, లక్ష్మీ నర్సయ్య, డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూటర్‌ వసంత్‌, అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాజారెడ్డి, స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ శ్యామ్‌ రావును సన్మానించారు.

'స్థానిక' ఎన్నికలపై 8న అఖిలపక్ష సమావేశం

నిజామాబాద్‌ రూరల్‌ : స్థానిక ఎన్నికల నిర్వహణపై అన్ని పార్టీలతో ఈనెల 8వ తేదీన స మావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్‌ సీఈవో సాయాగౌడ్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న సమా వేశానికి అన్ని పార్టీల నాయకులు హాజరు కావాలని, అన్ని పార్టీల నిర్ణయం తర్వాత ఈ నెల 10వ తేదీన పోలింగ్‌ కేంద్రాల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఖరారు చేస్తారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శివ(ఫైల్‌)

పిట్లం: పటాన్‌చెరు సమీపంలో బొలెరో వాహనం ఢీకొని పిట్లం మండలం హస్నాపూర్‌కు చెందిన శివ(28) అనే యువకుడు మృతి చెందిన ఘటన బువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పటాన్‌చెరు సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న శివను వేగంగా వచ్చిన ఓ బొలెరో వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివ అక్కడికక్కడే మృతి చెందాడు. శివ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: సారంగపూర్‌ హనుమాన్‌ ఆలయం గోశాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి(65–70) చెందినట్లు ఆరో టౌన్‌ ఎస్సై వెంకట్రావు బుధవారం తెలిపారు. ఈ నెల 1న గోశాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సదరు వ్యక్తిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి పోలీసులు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659848, 8712659734 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

పేకాట స్థావరాలపై దాడి

బాల్కొండ: మండలంలోని పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసినట్లు బాల్కొండ ఎస్సై శైలేందర్‌ బుధవారం తెలిపారు. బాల్కొండ మండలం వన్నెల్‌(బి)లోని గురడి కాపు సంఘం భవనం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 17వేల నగదు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అలాగే మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 4,710 నగదు, ఒక బైక్‌, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కిసాన్‌నగర్‌లోని మేదరి సంఘ భవనంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 3,800 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాత కలెక్టరేట్‌ ప్రాంతంలో గంజాయి విక్రయం!

ఖలీల్‌వాడి: నగరంలోని పాత కలెక్టరేట్‌ మైదానంలో గుర్తు తెలియని వ్యక్తులు గంజాయిని విక్రయించేందుకు వచ్చినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. పాత కలెక్టరేట్‌ మైదానంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఒకటో టౌన్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పట్టుకోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వస్తున్నారనే సమాచారంతో గంజాయి విక్రయానికి వచ్చిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు రావడంతో పరారైన చోట ఉంచిన బైకులో 20 ప్యాకెట్ల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బైక్‌ ను సీజ్‌ చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. బైక్‌, చుట్టూ పక్కల ఉండే సీసీటీవీ పుటేజీ ఆధారంగా గంజాయి అమ్మే వారి వివరాలను పోలీసులు సేకరిస్తున్నట్లు తెలిసింది.

అంగన్‌వాడీ టీచర్‌ ఆత్మహత్య

మోపాల్‌: మండలంలోని న్యాల్‌కల్‌ గ్రామానికి చెందిన బెల్లెడిగె చిన్ను (44) స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం తెలిసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్ను, పోతన్న భార్యాభర్తలు. చిన్ను కంతేశ్వర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తోంది. పోతన్న చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో ఇల్లు చిన్నది కావడంతో న్యాల్‌కల్‌ రోడ్‌లోని లలితానగర్‌లో అద్దె ఇంట్లో ముగ్గురు పిల్లలతో ఉంటున్నారు. కొంతకాలంగా కుటుంబసభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో మంగళవారం అర్ధరాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం చిన్ను ఇంట్లో కనిపించకపోయే సరికి భర్త పలుచోట్ల వెతికాడు. పశువుల కాపరులు చెరువులో మృతదేహాన్ని గుర్తించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో నలుగురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ 13 మందిలో నలుగురికి సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ జైలు శిక్షను విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ బుధవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిని ట్రాఫిక్‌ పీఎస్‌లో కౌన్సిలింగ్‌ నిర్వహించి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఆధారాలను పరిశీలించిన మెజిస్ట్రేట్‌ 9 మందికి రూ. 13 వేల జరిమానా విధించగా, నలుగురికి ఒక రోజు, రెండు, మూడు రోజుల జైలు శిక్షను విధించినట్లు సీఐ తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్‌



నవీపేట: గణేశ్‌ నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని రౌడీ షీటర్లకు నిజామాబాద్‌ నార్త్‌ రూరల్‌ సీఐ శ్రీనివాస్‌, ఎస్సై తిరుపతి బుధవారం కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఉత్సవాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని సూచించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భిక్షపతి, ఎస్సై కళ్యాణి

ధర్పల్లి: మండల కేంద్రంలో మహిళపై కత్తెరతో దాడి చేసి హత్య చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భిక్షపతి తెలిపారు. బుధవారం పోలీస్‌ సర్కిల్‌ కార్యాలయంలో ఎస్సై కళ్యాణితో కలిసి నిర్వహించిన సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ధర్పల్లికి చెందిన కోటగిరి దాసుకు గంగామణితో 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నేళ్లుగా దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో విడాకులు తీసుకొని వేర్వేరుగా ఉంటున్నారు. తన భార్య దూరం కావడానికి ధర్పల్లికి చెందిన మచ్చ లక్ష్మి, భోజేశ్వర్‌ అని అనుమానం పెంచుకున్న దాసు వారిని చంపేందుకు ఈనెల 2న లక్ష్మి ఇంటికి వెళ్లాడు. కత్తెరతో ఆమెపై, భోజేశ్వర్‌ పై దాడి చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ లక్ష్మిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. దాడిని అడ్డుకునేందుకు వచ్చిన నాలుగురికి సైతం గాయాలు కావడంతో వారు చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని బుధవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: దోపిడీ చేసేందుకు ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితునికి కామారెడ్డి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాలిలా ఉన్నాయి. మద్నూర్‌ మండలం మోగె డోంగ్లీ గ్రామానికి చెందిన బరిగె లక్ష్మణ్‌(60) రుణమాఫీ పని మీద గతేడాది జూన్‌ 20న మేనూర్‌ బ్యాంకుకని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. మరుసటి రోజు అతని కుమారుడు అశోక్‌ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. ఆ తర్వాత సలాబత్‌పూర్‌ శివారులో హత్యకు గురైన లక్ష్మణ్‌ మృతదేహాన్ని గుర్తించారు. సలాబత్‌పూర్‌కు చెందిన ర్యావన్వాడ సాయిలు అనే వ్యక్తి మృతుడిని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుడు సాయిలు చెడు అలవాట్లకు బానిసై డబ్బుల కోసం గతంలోనూ ఓ హత్యకు పాల్పడ్డాడు. లక్ష్మణ్‌ హత్యకు గురైన రోజున సలాబత్‌పూర్‌ శివారు లోని బ్రిడ్జి వద్ద రాత్రి 8 గంటల ప్రాంతంలో మృతుడు బస్సుకోసం వేచి ఉండగా అక్కడకు సాయిలు వచ్చాడు. లక్ష్మణ్‌ వద్దనున్న డబ్బులు కాజేసేందుకు అతనిపై సాయిలు దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది.

హత్య కేసు నమోదు చేసిన పోలీసులు సాయిలును అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్‌ వరప్రసాద్‌ నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ. రెండు వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన పోలీసు అధికారులు నరేశ్‌, రవికుమార్‌, విజయ్‌ కొండ, రాజయ్య, రామేశ్వర్‌ రెడ్డి, సిబ్బంది సాయన్న, శ్రీకాంత్‌ లను ఎస్పీ రాజేశ్‌ చంద్ర అభినందించారు.



జాతీయ పోషకాహార వారోత్సవాలు

సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
గురువారం ॥ 4-9-2025

ఫుడ్ ఫర్ టీన్స్



పిల్లల విషయంలో పెద్దవారికి ఒక రకమైన ఆందోళన ఉంటే... కాస్త పెద్ద పిల్లల విషయంలో ఇంకో రకమైన ఇబ్బందులు ఉంటాయి. అంటే పదేళ్లు దాటి టీనేజ్‌లో ఉండే పిల్లల్లో మరికొన్ని సమస్యలు చూస్తుంటాం. ఈ రోజుల్లో అయితే టీనేజ్ పిల్లల్లో ఆందోళన, మానసిక ఒత్తిడి, అధికంగా కోపం, డిప్రెషన్ వంటివి తరచూ వింటున్నాం. వారు తినే ఆహారపు ప్రభావం మానసిక, శారీరక స్థితిపైన చూపుతుంది. అందుకని, టీనేజ్ పిల్లలున్న ఇంట్లో పోషకాహారం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.

13–19 ఏళ్ల మధ్య ఫిజికల్, మెంటల్ గ్రోత్ వేగంగా మార్పు చెందుతుంటుంది. ఇలాంటప్పుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి (ఐసిఎమ్ఆర్) కొన్ని సాధారణ సూచనలు చేసింది. వాటి ఆధారంగా పోషకాహారాన్ని ఈ వయసు పిల్లలకు సరైన మొత్తంలో ఇవ్వాలి. అలాగే, ఆ ఆహారం మనసుకు సంతృపినిచ్చేలా ఉండాలి.

టీనేజ్ పిల్లల బరువు, ఎత్తు, చేసే పనులు.. ఇవన్నీ దృష్టిలో నిపుణుల సలహాతో సమతుల ఆహారాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో కాకుండా రోజులో 5-6 సార్లు సమయాన్ని బట్టి పైన టేబుల్‌లో ఇచ్చిన హెల్తీ ప్లేట్‌ను తయారుచేసుకోవచ్చు.

బ్రేక్‌ఫాస్ట్
కప్పు గోధుమ ఉప్మా /దోసె - 2 / కిచిడీ - కప్పు / రాగి రొట్టె - 2 -3 / ఇడ్లీ - 2-3 + కప్పు సాంబార్ + ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లేట్ + కొద్దిపాటి గింజలు.

ఉదయం స్నాక్స్
పండు (ఆపిల్ లేదా అరటి లేదా నారింజ) + కొద్దిగా డ్రైఫ్రూట్స్ / పల్లీ చిక్కీ / వేపిన శనగలు / వేయించిన అవిసెగింజలు / డ్రై ఫ్రూట్ బార్ / ఉడికించిన వేరుశెనగ

మధ్యాహ్న భోజనం
అన్నం - 1 కప్పు లేదా గోధుమ రొట్టె - 2-3 / తృణ ధాన్యాలు - 1 కప్పు + ఆకుకూరలు - 1 కప్పు + మిక్స్‌డ్ వెజిటబుల్స్ - 1 కప్పు + చికెన్ బ్రెస్ట్ - 100 గ్రా / గుడ్డు - 1 / పనీర్ - 100 గ్రా / చేప - 100-120 గ్రా. + పెరుగు - 1 కప్పు

సాయంత్రం స్నాక్స్
మొలకెత్తిన గింజలు, విత్తనాలు - 30 గ్రా + చియా సీడ్స్ + నిమ్మరసం/ పాలు/ పండు జ్యూస్ లేదా సూప్.

రాత్రి భోజనం
మధ్యాహ్న భోజనం మాదిరిగానే + గ్రిల్ చేసిన చికెన్ బ్రెస్ట్ అన్నంతో లేదా రొట్టెతో + కూరగాయలు + ఉడికించిన బ్రొకోలీ

కిలో కేలరీలు : అబ్బాయిలకు 2200-3200 : అమ్మాయిలకు 1800 - 2500
ప్రొటీన్లు : అబ్బాయిలకు - 52 గ్రా. : అమ్మాయిలకు - 46 గ్రా.
కొవ్వులు (Fat) : 25-35%
కార్బోహైడ్రేట్స్ : 45-65%
విటమిన్-ఎ : 600-900 మైక్రోగ్రాములు
విటమిన్ - సి : 45-75 మి.గ్రా
కాల్షియం : 1300 మి.గ్రా   నీళ్లు - 8 నుంచి 12 గ్లాసులు



- డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

ఫుడ్ గ్రూప్స్, పరిమాణం

ఏదైనా పండు	- 1 రోజుకు 2-3 సర్వింగ్స్
కూరగాయలు	- రోజుకు 3-5 సర్వింగ్స్ (ఉడికించినవి లేదా వండినవి)
ధాన్యంతో వండినవి	- రోజుకు 6 - 8 సర్వింగ్స్ (1 సర్వింగ్ - ½ కప్పు ఉడికిన అన్నం/సిరిధాన్యం/గోధుమ)
డెయిరీ ఉత్పత్తులు	- రోజుకు 2 - 3 కప్పులు (పాలు, పెరుగు, చీజ్ రూపంలో)
ఆరోగ్యకరమైన కొవ్వులు	- రోజుకు 1 టేబుల్ స్పూన్ (నూనె, గింజలు, విత్తనాలు మొదలైనవి)
ప్రొటీన్ ఆహారం	- మాంసం, గుడ్డు మొదలైనవి (1 సర్వింగ్)

● మన(సు)లో మాట

తీవ్ర మనోవ్యాధికి సంజీవని!

మేము కోయంబత్తూరులో సెటిల్ అయిన తెలుగు వాళ్లము. మా అబ్బాయి బీటెక్ తర్వాత ఎం. ఎస్. కోసం సంవత్సరం క్రితం అమెరికాకు వెళ్లాడు. మొదట 6 నెలలు బాగానే ఉన్నాడు. తర్వాత అతని ఆలోచనలు, ప్రవర్తనలు మారాయి. అమెరికాలో ఉన్న పోలీసులు, గూఢాచారులు తనని వెంబడిస్తున్నారని తన మెదడు మీద, ఎలాన్ మస్క్, ట్రంప్ ప్రయోగాలు చేస్తున్నారని అనుమానంతో భయపడుతూ–ఉండేవాడు. ఆ ప్రవర్తన ఎక్కువై బాగా చికాకు చేస్తే అక్కడే ఉండే మా చుట్టాలు 6 నెలల క్రింద ఇండియాకు పంపించారు. ఎయిర్ పోర్టులో దిగాక నేరుగా చెన్నైలో ఒక ఆస్పత్రిలో అడ్మిట్ చేశాము. 'స్కిజోఫ్రినియా' లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, బాగా అగ్రెసివ్‌గా, సూసైడల్ ఆలోచనలతో ఉన్నాడని అక్కడి డాక్టర్లు ఇ.సి.టి. ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మా ఫ్యామిలీ డాక్టర్‌ని అడిగితే ఆయన ఇ.సి.టి. వల్ల మెదడు దెబ్బతింటుంది, భవిషత్తులో ఇబ్బందులు వస్తాయని చెప్పారని, మేము ఆ ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసి వేరే హాస్పిటల్‌కి తీసుకెళ్లాము. పెద్దగా ఫలితం కనిపించకపోయేసరికి ఇంగ్లీష్ వైద్యం కాకుండా వేరేవైద్యానికి వెళ్లాము. చాలా రోజులు ఆ మందులు వాడినా ఎలాంటి మార్పూ లేదు. దయచేసి మాకు ఏదైనా మంచి దారి చూపగలరు.

- సోమలింగేశ్వరరావు, కోయంబత్తూరు

చాలామందిలో అంతర్గతంగా ఉండే ఇలాంటి సమస్యను సాక్షి ద్వారా తెలియజేసినందుకు మీకు నా అభినందనలు. మీ అబ్బాయికి వచ్చిన స్కిజోఫ్రీనియా వ్యాధి వలన ఎంతగా సంఘర్షణకి గురయ్యారో అర్థం అవుతోంది. ముందుగా మీరు అర్థం చేస్కోవాల్సింది, మెదడులో వచ్చే కొన్ని రసాయనిక మార్పుల వల్లనే ఇలాంటి మానసిక సమస్యలు వస్తాయని, అవి తగ్గాలంటే ఆ రసాయనాలని సాధారణ స్థితికి తీసుకురావాలనీ మానసిక వైద్యులు మొదటిగా మందులు, కౌన్సెలింగ్ ద్వారా మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తారు.

అయితే కొన్నిసార్లు ఆ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు లేదా పేషెంటుకి ఆత్మహత్య ఆలోచనలు, జబ్బువల్ల ఇతరులకు హాని చేసేంత ఆవేశం, కోపం, ఉన్నప్పుడు, మందులు పని చేయడానికి చాలా సమయం పట్టొచ్చు; అలాంటప్పుడు పేషెంటుకి కుటుంబ సభ్యులకి జరిగే నష్టం ఎక్కువ. దీన్ని నివారించడం కోసం అత్యంత వేగంగా, ప్రభావ వంతంగా పనిచేసే ఒక సంజీవని లాంటి వైద్య విధానమే' ఇ.సి.టి. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ. అంతమంచి చికిత్స విధానాన్ని వాడుక భాషలో 'షాక్ ట్రీట్మెంట్' అంటారు. అదే అన్ని సమస్యలకి, అపోహలకి కారణం అయింది. దీనివల్ల మనిషికి ప్రాణహాని అని లేదా నరాలు చచ్చుబడి, సంసారానికి పనికి రారు అని అనేక అపోహలు, సాధారణ ప్రజలతో పాటు, కొంత మంది వైద్యుల్లో కూడా ఉన్నాయి. మన శరీరంలో ఇతర జ్ఞానేంద్రియాలు, కండరాలు ఇతర వ్యవస్థలన్ని పనిచేయడానికి మెదడులో ఉత్పత్తి అయ్యే కరెంట్ చాలా ముఖ్యం. దాన్ని మార్చడం ద్వారా మెదడులోని రసాయనాల అసమతుల్యాను కూడా సరి చేయవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఫోన్ లేదా కంప్యూటర్ కి వైరస్ వచ్చి పని చేయకపోతే రీసెట్ ' బటన్ నొక్కి దాన్ని పనిచేసే కండిషన్‌కి ఎలా తీసుకు వస్తామో ఇ.సి.టి. కూడా మెదడుని అలాగే రీసెట్ చేస్తుంది. దీనివల్ల దీర్ఘకాలికంగా ఎలాంటి సమస్యలు వస్తాయని ఇప్పటి వరకు ఎలాంటి శాస్త్రీయ పరిశోధనా తేల్చలేదు. ఒక పేషెంట్ అన్ని రకాలుగా శారీరకంగా ఫిట్‌గా ఉంటేనే ఇ.సి.టి. చికిత్స చేస్తారు. మీ అబ్బాయిని పరీక్షించిన డాక్టరు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకపోతేనే ఇ.సి.టి. ట్రీట్మెంట్ గురించి చెప్పి ఉంటారు. కాబట్టి ఎలాంటి అపోహలు, భయాలు లేకుండా చికిత్స ఇప్పించి, మీ వాడి జబ్బు లక్షణాలను తొందరగా తగ్గించుకోండి.

మీ అలాగే వాళ్ళు చెప్పినన్ని రోజులు మందులు వాడితే జబ్బు మళ్ళీ తిరగబెట్టకుండా ఉంటుంది. ఆల్ ది బెస్ట్ !



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బయోపిక్

వెండితెరపై కశ్మీర్ కోయిల

మనకు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి తెలుసు.
మహనీయ కర్నాటక సంగీత విద్వాంసురాలు.
లతా మంగేష్కర్ తెలుసు. సినీ సంగీతానికి రారాణి.
కాని **రాజ్ బేగం** తెలియదు.
ఆమె వీరిద్దరి కాలం నుంచే పాడుతోంది.
వీరితో సమానంగా కశ్మీర్ ప్రజల జేజేలు అందుకుంది.
కశ్మీర్ కోయిల బిరుదు అందుకుంది.
కాని ఆమె దేశానికి తెలియడానికి ఇంత కాలం పట్టింది.
అదికూడా ఇప్పుడు ఆమె జీవితం ఆధారంగా తీసిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమా అమేజాన్‌లో విడుదల అయ్యాక.



1950ల కాలం ఊహించండి.

కశ్మీర్ పర్వత ప్రాంతం. అక్కడివన్నీ గిరిజన సంప్రదయాలు. కశ్మీర్‌కే తనదైన గొప్ప సంగీతం, గానం, వాయిద్యం, కవిత్వం, గీతం... ఉన్నాయి. అక్కడ కశ్మీరీ భాషలో ఎంతో మంచి సాహిత్యం ఉంది. కాని అక్కడ ఉర్దూ, హిందీ కూడా వాడుకలో ఉంది. నిరంతరం ఏదో ఒక అలజడికి లోనయిన ఆ ప్రాంతంలో స్త్రీలు ఏ పనిలో అయినా ముందుకు రావడం కష్టంగా ఉండేది. వారి కళ కూడా నాలుగ్గోడల మధ్యే తప్ప బహిరంగం కావడానికి లేదు.

ఈ నియమాన్ని బ్రేక్ చేసిన గాయని రాజ్‌బేగం.

1927లో శ్రీనగర్‌లో జన్మించిన రాజ్‌బేగం బాల్యంలోనే పాటను గ్రహించింది. అది అక్కడ కురిసే మంచులా ఆమెలో సహజంగా ఉద్భవించింది. గిరిజన గీతాలు, జానపద పాటలు పెళ్లిళ్లలో పాడటం మొదలు పెట్టింది. 1950లలో ఆమె మొదటిసారి ఆల్ ఇండియా రేడియో కశ్మీర్ స్టేషన్‌లో పాడింది. మరో నాలుగేళ్లకు అదే రేడియోలో స్టాఫర్ అయ్యింది. ఆ తర్వాత బహిరంగ వేదికల మీద పాడసాగింది. తన జీవిత కాలంలో కనీసం రెండు వేల పాటలు ఆమె పాడింది. అయితే దురదృష్టవశాత్తు ఏ పాట రికార్డింగూ అందుబాటులో లేదు.

కశ్మీర్ సంగీతానికి ఆమె చేసిన సేవకు 2002లో 'పద్మశ్రీ' దక్కినా ఆమెకు రావాల్సిన ఖ్యాతి రాలేదు. 2016లో రాజ్ బేగం మరణించింది. జనం ఆమెను అక్కడ నిత్యం తలుచుకుంటూనే ఉంటారు. దేశానికి ఆమె పేరు చేరలేదు. కశ్మీర్‌లో పుట్టి పెరిగి అమెరికాలో చదువుకొని వచ్చిన అక్కడే స్థిరపడ్డ దర్శకుడు డానిష్ రెంజు ఆమె బయోపిక్‌ను తీసే అవకాశం పొందగలిగాడు. రాజ్ బేగం జీవితాన్ని, సంగీతాన్ని 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'గా తీశాడు. అమేజాన్‌లో ఆ సినిమా ఆగస్టు 29 నుంచి స్ట్రీమ్ అవుతూ విమర్శకుల ప్రశంసలు పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సంగీత అభిమానుల మెప్పు అందుకుంటోంది. దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్ ఈ సినిమాకు ఒక నిర్మాత కావడం విశేషం.

***

'అమ్మా... దేవుడు స్త్రీలను పుట్టించింది కేవలం పెళ్లి కోసం కాదు' అని తన యవ్వన కాలం నుంచి తిరగబడుతూ తన దారిని నిర్మించుకుంటుంది రాజ్ బేగం 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమాలో. పెళ్లిళ్లలో పాడుతూ గుర్తింపు పొందిన రాజ్ బేగం రేడియో కశ్మీర్‌లో ఆడిషన్ ఇవ్వడానికి వెళితే అక్కడంతా అబ్బాయిలే ఉండి 'నువ్వొచ్చావ్ ఏంటి' అన్నట్టుగా చూస్తారు. అయినా వారిని ఎదిరించి ఆడిషన్ ఇచ్చి ఎంపికవుతుంది రాజ్ బేగం.



అయితే స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఆమె తన సొంత పేరును చెప్పుకోవడానికి వీలుండదు. 'నూర్ బేగం' పేరుతో రేడియోలో పాడుతుంది. ఇది కొన్నాళ్లకు తెలిసి ఆమె ఊరి వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఆడపిల్ల ఇలా మగవాళ్లుండే చోటుకు వెళ్లి పాడటం ఏంటని రాళ్లతో కొడతారు. బహిరంగ వేదికల మీదకు రాకుండా చూస్తారు. రాజ్ బేగం ఇవన్నీ తట్టుకుని తన పాటను జనం వద్దకు తీసుకువెళుతుంది. ఏ జనమైతే ముందు వ్యతిరేకించారో వారంతా ఆమె అభిమానులుగా మారతారు. ఆమెను తమ ప్రాంతపు సాంస్కృతిక రాయబారిగా చేసుకుంటారు. ఆమె పాటలకు పరవశిస్తారు. తన జీవితంలో వేల కొలది పాటలు పాడి రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చింది రాజ్ బేగం. ఆమె వేసిన దారిలో ఇవాళ ఎందరో కశ్మీర్ గాయనులు పాటలు పాడుతున్నారు. రాజ్ ఎదుర్కొన్న వ్యతిరేకత వీరికి లేదు.

'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'లో యంగ్ రాజ్ బేగంగా సబా ఆజాద్, వృద్ధ రాజ్ బేగంగా సోని రాజ్‌దాన్ (ఆలియా భట్ తల్లి) నటించారు. సినిమా హిందీ భాషలో సాగినా పాటలు కశ్మీర్ సువాసనలతో ఉంటాయి. కశ్మీర్ జీవితం, సంప్రదాయాలు, మాటా, వరుస... అన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఇన్నాళ్లకు కశ్మీర్ సినిమా ఒకటి వచ్చింది.

అది ఒక గాయని గురించి కావడం సంతోషపడవలసిన సంగతి.

కళ మరణించదని మరో సారి నిరూపితమైంది.



● పద్మశ్రీ అందుకుంటున్న రాజ్ బేగం

● పేరెంటింగ్

ఒక హీరో గురించి...

పిల్లలకు ఎప్పుడూ బడి పాఠాలే కాదు బతుకు పాఠాలు, నైతిక విలువల గురించి కూడా చెప్పాలి. అదే నిజమైన పేరెంటింగ్. ఒక తండ్రి తన పిల్లాడికి సులువైన భాషలో మంచీచెడుల గురించి చెప్పిన మాటలు నెటిజనులకు తెగ నచ్చాయి.

ఫైనాన్షియల్ సర్వీసెస్ 'మైఫండ్‌బాక్స్' సీయీవో అనూజ్ పాల్...

'నీ గురించి స్కూల్‌లో ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా?' అని తన చిన్నారిని అడిగాడు.



'నేను ఒకరిని కొట్టాను' అన్నాడు అద్విక్.

'ఎవరిని కొట్టావు? ఎందుకు కొట్టావు?' అని అడిగిన తండ్రి... 'ఒక అమ్మాయిని అలా కొట్టవచ్చా?

నువ్వు ఆ అమ్మాయి వస్తువు లాగేసుకున్నావు. ఇతరుల వస్తువులు అలా లాక్కోవచ్చా? మీ క్లాస్‌మేట్స్ ఇద్దరు కలిసి నిన్ను కొట్టారనుకో, నీకు బాధగా అనిపించదా? వాళ్లు చేసింది తప్పు అనిపించదా... ఇది సరే, నువ్వు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావు? హీరో అవుతావా? విలన్ అవుతావా?' అని అడిగాడు అనూజ్.

'హీరో' అని జవాబు చెప్పాడు అద్విక్.

'తప్పు చేసినప్పుడు సారీ చెప్పేవారే నిజమైన హీరోలు. మరి నువ్వు సారీ చెబుతావా?' అని అడిగాడు తండ్రి. అద్విత్ ఆ అమ్మాయికి 'సారీ' చెప్పాడు! ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

● టెక్నో ఉమెన్

ఛాయా చిత్రం



'మెటా'లో దశాబ్దకాలం పాటు పనిచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్ ఛాయ నాయక్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ'లో చేరింది. ఓపెన్ ఏఐలో ఆమె 'స్పెషల్ ఇనిషియేటివ్స్' టీమ్‌లో పనిచేయనుంది.

'సరియైన సమయంలో సరియైన నిర్ణయం' అని కంపెనీ మార్పు గురించి స్పందించింది ఛాయ. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఛాయ నాయక్ సెక్యూరిటీ, పీస్ స్టడీస్‌లో డిగ్రీ చేసింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పబ్లిక్ పాలసీ, డాటా సైన్స్‌లో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేసింది. పుణేలో 'పాత్‌వేస్ టు ఎంపవర్‌మెంట్'లో ప్రాజెక్ట్ మెనేజర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించింది. ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ కార్యాలయం(యూఎస్)లో జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్‌మేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేసింది. 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫ్యూచర్'లో కన్సల్టెంట్‌గా, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో గ్రాడ్యుయేట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన ఛాయ ఆ తరువాత డాటా-డ్రైవన్, సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టింది. 'మెటా'లో 'డాటా ఫర్ ఇనిషియేటివ్' హెడ్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. ఫేస్‌బుక్‌లో ఓపెన్ రీసెర్చ్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఫోర్ట్) హెడ్‌గా పనిచేసింది. 'ఓపెన్ ఏఐ'లోకి రావడానికి ముందు ఫేస్‌బుక్‌లో జనరేటివ్ ఏఐ ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మెటాలోని తొలి రోజులు నిన్నా మొన్నా జరిగినట్లే అనిపిస్తున్నాయి. మెటాలో పని చేసిన అనుభవం నా కెరీర్‌కు గట్టి పునాది వేసింది' అంటుంది ఛాయ. 'నా ప్రయాణం ఆగిపోలేదు. పుస్తకంలో ఒక పేజీని తిప్పాను. అంతే!' అని లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో కంపెనీ మార్పు గురించి రాసింది ఛాయానాయక్.

● డిజిటల్ అలర్ట్

అలా... ఆమె ప్రాణాలు కాపాడారు!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలికి చెందిన అమ్మాయి ఒకరు 'నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను' అని అర్ధరాత్రి దాటిన తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. 'మెటా' వెంటనే ఈ పోస్ట్‌ను స్టేట్ పోలీస్ మీడియా సెంటర్‌కు పంపి పోలీసులను అలర్ట్ చేసింది. కేవలం పదహారు నిమిషాల వ్యవధిలో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్, కొందరు మహిళా పోలీసులు ఆ అమ్మాయి ఉన్న ఇంటికి చేరుకున్నారు. వాంతులు చేసుకున్న ఆ అమ్మాయి నిస్తేజంగా పడి ఉంది. వెంటనే ఆమెను హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

సమయానికి ఆస్పత్రికి తీసుకురావడం వల్ల ఆ అమ్మాయి చావు నుంచి బయటపడింది. ఆమె కోలుకున్న తరువాత... 'ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు?' అని అడిగితే... తాను ప్రేమించిన వ్యక్తి మాట్లాడడం మానేశాడని, తన ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని...ఇలా చెప్పుకుంటూ పోయింది.

పెరుగుతున్న ఆన్‌లైన్ సుసైడ్ అటెంప్ట్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు, మెటా భాగస్వామ్యంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో సుసైడ్-రిలేటెడ్ పోస్ట్‌లపై నిఘా పెడుతున్నారు. వెంటనే రంగంలోకి దిగుతున్నారు. జనవరి 1, 2023 నుంచి ఆగస్ట్ 25, 2025 వరకు 1,315 మంది ప్రాణాలను కాపాడారు.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) సెప్టెంబర్ 3న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,06,810	1,08,950	1,06,970	1,08,950	1,07,200	1,06,960
బంగారం (22 క్యారెట్లు)	99,890	98,050	98,050	1,00,990	98,620	98,050
వెండి	1,27,000	1,26,300	1,37,000	1,26,300	1,26,000	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.